**కథ**

కళ్యాణి!

సృష్టికర్త స్వహస్తాలతో గీసిన పెయింటింగ్‌లా ఉంటుంది. ఉదయాస్తమయ రవి కిరణాల తేజస్సు ఉట్టిపడుతుంటుందామె చూపులో. ఆమె కదిలితే బాపు బొమ్మ ప్రక్కనుంచే నడిచి వెళ్ళినట్లుగా ఉంటుంది. ఆమె పలికితే మోనాలిసా మాట్లాడినట్లుగా ఉంటుంది.

యూనివర్సిటీలో ఆమె ఓ నిశ్శబ్ద సంచలనం. క్లాస్ సబ్జెక్టయినా తెలీని విద్యార్థి ఉండొచ్చేమోగానీ, కళ్యాణి గురించి తెలీని విద్యార్థి ఆ కేంపస్‌లో ఉన్నాడనడం అతిశయోక్తి అవుతుంది. చక్కనైన నాగాన్ని పేరుగా పెట్టుకున్న ఆమె చక్కని వ్యక్తిత్వాన్ని కూడా కలిగుండడం ఓ కారణమైతే ఆర్టిస్టుగా ఆమె ప్రతిభ ఆమెకు అనూహ్యమైన స్థాయిని ఆర్జించిపెట్టింది.

# [illegible]

చిరుగాలి స్పర్శకు కదిలే చివురుటాకుల్లా సున్నితమైన ఆమె వేళ్ళు కేన్వాస్ మీద కదలాడితే ఎంత సంక్లిష్టమైన చిత్రమైనా సరే అక్కడ సాక్షాత్కరించవలసిందే.

ఆమె చేత క్యారికేచర్స్ గీయించుకున్నవారు అద్దంలో తమ ప్రతిబింబాన్ని చూసుకున్నంత అనుభూతిని పొందుతారు.

ఆంధ్రా యూనివర్సిటీకి ఆమె ఓ పెద్ద అసెట్.

''ఏదో ఒక రోజున నా కూతురు భారతదేశం గర్వించదగ్గ గొప్ప చిత్రకారిణి అవుతుంది'' కార్లో వెళ్తూ కూడా నోట్ బుక్‌లో ఏదో ఒక చిత్రాన్ని గీస్తుండే కూతురి వంక మురిపెంగా చూసుకుంటూ అనుకుంటుంటాడు భాస్కరరావు ఎప్పుడూ.

''గురువు లేని విద్య గుడ్డి విద్య అంటారు. కానీ నీ ప్రతిభ చూస్తుంటే ఏ విద్యకైనా గురువుతో అవసరమేముందనిపిస్తుంది కళ్యాణీ! ఇదెలా సాధ్యం?''

''ఇందులో నేను పెద్దగా సాధించిందేముందే?'' స్నేహితురాలు కాంతి సందేహానికి సున్నితంగా సమాధానమిచ్చింది కళ్యాణి.

కాని ఆమె అంతరంగాలు మాత్రం ఎక్కడో దాగున్న అనంత తీరాలను తాకడానికే ప్రయత్నిస్తుంటాయి. అంతులేని ఆమె కళాతృష్ణ ఎప్పుడూ ఏవేవో సాధించడానికన్నట్లుగా తాపత్రయపడుతూనే ఉంటుంది.

''ఒకటా? రెండా? ఇన్ని గోల్డ్ మెడల్స్ ఏం చేసుకుంటావే తల్లీ? వీటితో నీ పెళ్ళికి కావాల్సిన ఏడు వారాల నగలు చేయించుకుంటావా ఏంటి?'' తన పర్సనల్ రూమ్‌లో ఎంతో కళాత్మకంగా అమర్చబడిన వందలాది గోల్డ్‌మెడల్స్‌ని చూస్తూ అడిగిన సుచరిత ప్రశ్నకు చిరునవ్వే ఆమె సమాధానమయ్యింది.

ఆ చిరునవ్వును చూస్తే చాలు ఎన్నో చిత్రాలు జీవం పోసుకుంటాయి.

''నువ్వు మా స్నేహితురాలివైనందుకు మాకే అంత గర్వంగా ఉంటే ఇంత పెద్ద ఆర్టిస్టువి... నిన్ను చూసి నీకు గర్వమెయ్యదంటే??'' అని వారన్నప్పుడు అందుకు సమాధానంగా అందమైన ఓ చిత్రాన్ని అప్పటికప్పుడు వేసి చూపిస్తుంది.

తను ఎక్కువగా మాట్లాడకపోయినా తన చిత్రాలతో ఎప్పుడూ మాట్లాడిస్తూనే ఉంటుంది.

ఆమె పెయింటింగ్స్‌లో నిత్య జీవిత సత్యాలు స్పష్టంగా ప్రతిఫలిస్తూ ఉంటాయి. తైలవర్ణ చిత్రాల్లో ఆమె నేర్పరితనం, రేఖా చిత్రాల్లోని ఒడుపు కళాభిమానుల అభిమానాన్ని విశేషంగా చూరగొంటుంటాయి.

అందమైన ఒక జలపాతాన్ని ఆమె చిత్రించిందంటే ఆ పెయింటింగ్‌కి చెవులొంచి ఆ జలపాత హోరును వినవచ్చేమోనన్న భ్రాంతి కలుగుతుంది ఎవరికైనా.

★★★

ఆరోజు ఆదివారం కావడంతో సాయంత్రం ఫ్రెండ్స్‌తో సరదాగా బీచ్‌లో గడిపి తిరిగొస్తూ రోడ్డు మీద ఫుట్‌పాత్ దగ్గర రంగురంగుల చాక్‌పీసుల్తో ఆంజనేయస్వామి బొమ్మను గీస్తున్న ఓ డెబ్భైయేళ్ళ వృద్ధుణ్ణి చూసి ఆగింది కళ్యాణి.

ఆ బస్టాప్ దగ్గర బస్సుకోసం వెయిట్ చేస్తున్నవారు, అటుగా వెళ్తున్నవారు దాదాపు పూర్తికావచ్చిన ఆ బొమ్మమీద తమకు తోచిన చిల్లర వెయ్యసాగారు.

''ఇలా బొమ్మని రెండు మూడు గంటలు శ్రమించి వేస్తే, ఓ పది రూపాయలు వస్తాయేమో?'' తన హేండ్ బ్యాగ్‌లోనుంచి రూపాయి కాయిన్ తీసి దాని మీద వేస్తూ అంది కాంతి.

''పాపం ఆ చాక్‌పీసుల ఖరీదైనా వస్తుందో లేదో?'' తనూ ఓ రూపాయి వేస్తూ అంది సుచరిత.

సంజీవని పర్వతాన్ని ఎత్తుకొస్తున్న ఆంజనేయ స్వామి బొమ్మ అది.

ఒళ్ళు పులకరించింది కళ్యాణికి ఆ బొమ్మని చూడగానే.

రంగురంగుల కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ పర్వతం మీద నిజంగానే కాంతులు విరజిమ్ముతున్నాయా అన్నంత ప్రకాశవంతంగా ఉందా ఆర్టు.

ఆ ఆర్టిస్టు నైపుణ్యానికి అబ్బురపడుతూ తన హేండ్ బ్యాగ్‌ని ఓపెన్ చేయబోయింది. కాని అంతలోనే ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావడంతో గబగబా ఆ బస్ షెల్టర్‌లోకి దూరింది.

చిన్న చినుకులతో ప్రారంభమైన ఆ చిరువాన ఒక్కసారిగా కుంభవృష్టిగా మారడంతో రోడ్డు మీద వేస్తున్న ఆ బొమ్మ నెమ్మదిగా వాన నీటిలో కరిగిపోసాగింది.

షెల్టర్‌లో ఓ మూల ఒదిగి కూర్చొని కరిగిపోతున్న బొమ్మవంకే దీనంగా చూడసాగాడు ఆ వృద్ధుడు.

ఆ వృద్ధుణ్ణి, కరిగిపోయి కాలవలోకి కారిపోతున్న ఆ చాక్‌పీస్ డ్రాయింగ్‌ని మార్చి మార్చి చూడసాగింది కళ్యాణి. ఆమె మనసు బాధతో మూలిగింది.

హేండ్ బ్యాగ్‌ని వంటికి హత్తుకుని తల నిండా చున్నీలు చుట్టుకుని కుండపోతగా కురుస్తున్న వర్షం కేసి చూస్తూ ఆ చల్లని వాతావరణంలో ఏవేవో కబుర్లలో పడిపోయారు కాంతి, సుచరితలు.

నెమ్మదిగా చీకట్లు కమ్ముకోసాగాయి. ఎప్పుడు వెలిగాయో కూడా తెలీని వీధి దీపాలు ఆ వర్షంలో అయిష్టంగా మినుకు మినుకుమనసాగాయి.

గంటకు పైగా కురిసిన ఆ కుంభవృష్టికి అంతకుముందు అక్కడో బొమ్మ వేసుందా అనే ఆనవాలే లేకుండా మొత్తం తుడిచిపెట్టుకుపోవడంతో వృధా అయిన ఆ వృద్ధుడి శ్రమకి ఎంతగానో నొచ్చుకుంది కళ్యాణి. వాన పూర్తిగా వెలసిన తరువాత షెల్టర్ లోంచి బైటికొచ్చి నిలబడింది.


ఆ వృద్ధుడు చిన్న కిరోసిన్ బుడ్డీని వెలిగించి ఆ చీకట్లో రోడ్డు మీద తను బొమ్మ వేసిన చోట పడున్న చిల్లరని వెదుక్కోసాగాడు.

చివుక్కుమనిపించింది కళ్యాణికి.

వెంటనే తన హేండ్ బ్యాగ్‌లో నుంచి వంద రూపాయల నోటు తీసి అతనికివ్వబోయింది.

ఒక్కసారిగా అంత పెద్ద నోటును చూడగానే నివ్వెరబోయిన అతను, ఆ దాత ఎవరా అన్నట్లు దీపం బుడ్డీని పైకెత్తి కళ్ళు చిట్లించి చూడ్డానికి ప్రయత్నించాడు.

అప్పటికే ఆటో ఎక్కున్న కాంతి, సుచరితలు ''మళ్ళీ వర్షం పడేట్లుంది త్వరగా రావే'' అని కేకెయ్యడంతో ఆ వంద నోటుని అతని చేతిలో పెట్టేసి గబగబా ఆటోవైపు నడిచింది.



ఆ రాత్రి మరో అద్భుతమైన పెయింటింగ్ ఆమె ఆర్ట్ గ్యాలరీలో చోటు చేసుకుంది.

ముడతలు పడిపోయి, జారిపోయిన చర్మంతో, బాగా లోతుకుపోయిన కళ్ళతో జీవిత సారాన్ని పూర్తిగా గ్రహించిన తేజస్సు నిండిన భృకుటితో, చీకట్లో దీపం పట్టుకు భవిష్యత్తుకోసం ఆశగా, ఆతృతగా ఎదురుఃస్తున్న వృద్ధ మేధావి తైలవర్ణ చిత్రమది.

దానికేం టైటిల్ పెట్టాలా అని ఆ ఉదయం నుండి తీవ్రంగా యోచిస్తున్న ఆమెతో కాంతి,

''ఆహా! ఆ తాత ఎంతదృష్టవంతుడే! ఎంతో పుణ్యం చేసుకోబట్టే నీ కేన్వాస్ ఎదకెక్కగలిగాడు'' అంది ఆ పెయింటింగ్‌కేసి స భ్రమంగా చూస్తూ.

స్నేహితురాళ్ళ అభినందనలందుకుని లేజీకి బయల్దేరింది. క్యాంపస్‌లోకి ఎంటరవ్వగా ప్రిన్సిపాల్ నుంచి పిలుపు రావడంతో ఆయన ఛాం లోకి అడుగుపెట్టింది.

''చూడమ్మా కళ్యాణీ! ఆల్ ఇండియా టర్ యూనివర్సిటీ స్పాట్ పెయింటింగ్ కాంపిటేషన్స్ ఈ నెల 26న ఢిల్లీలో నిర్వహించబోతున్నట్టు సెంట్రల్ యూనివర్సిటీ నుంచి ఈరోజ ఇన్విటేషన్ అందింది. ఎటువంటి స్క్రీనింగ్ టెస్ట్ లేకుండా మన యూనివర్సిటీ నుంచి నిన్నే ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.''

''థాంక్యూ వెరీమచ్ సార్!'' అందామె వెంటనే అమితానందంతో.

తను ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న అపూర్వ అవకాశమిది.

ఎంట్రీ ఫారం మీద సంతకం పెట్టిచ్చిన ఆమెతో ''నీమీద చాలా హోప్స్ ఉన్నాయమ్మా! ఈ కాంపిటీషన్‌లో మెడల్ సాధిస్తే జాతీయస్థాయి పోటీలకు ఎంట్రీ లభిస్తుంది. ఆల్ ది బెస్ట్!'' అన్నారాయన.

యూనివర్సిటీలో తనకున్న పేరుప్రఖ్యాతులు తనపై మరింత బాధ్యతను మోపాయని మొట్టమొదటిసారిగా గ్రహించింది కళ్యాణి. ఆ క్షణం నుంచే ఆ అవకాశాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి అని రూపకల్పన చేసుకోసాగింది.

పోటీల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ ఆమెలో భావోద్వేగం అధికం కాసాగింది.

''మన యూనివర్సిటీకి పెయింటింగ్‌లో మొట్టమొదటిసారిగా గుర్తింపు తీసుకొచ్చింది నువ్వు. మిగతా యూనివర్సిటీలు కూడా ఈ కాంపిటేషన్‌లో నీ రాకకోసం ఎంతో క్యూరియస్‌గా ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది కళ్యాణీ!''

పోటీలకు మరో గంటలో బయల్దేరాలనగా రిజిస్ట్రార్‌గారు ప్రత్యేకంగా పిలిపించడమేగాక కాంపిటేషన్‌కు కావలసిన కిట్‌ను ప్రెజెంట్ చేస్తూ

తిమ్మన శ్యామ్‌సుందర్ నాయుడు

అన్న మాటలు ఆమె ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేసాయి.

''ప్రయత్నిస్తాను...కాదు తీవ్రంగా కృషి చేస్తాను. ఊహూ! సాధిస్తాను.'' స్థిరంగా అనుకుంటూ రైల్వే స్టేషన్‌కి బయల్దేరుతూ.

దార్లో కాంతి, సుచరితలిస్తున్న సూచనలకు చిన్నగా నవ్వుకుంది.

స్టేషన్ దగ్గరౌతుందనగా అలవోకగా బైటికి చూసిన ఆమెకు అదే వృద్ధుడు మళ్ళీ కనిపించడంతో ఆసక్తిగా అతను వేసిన బొమ్మకేసి చూసింది.

ఆ ఆర్ట్‌ని చూసి అబ్బురపడింది.

ఎప్పట్లా ఏ దేవుడి బొమ్మనో వెయ్యకుండా భావగర్భితమైన ఓ మోడర్న్ ఆర్ట్‌ని అతను వెయ్యడంతో అతని ప్రతిభని అంచనా వెయ్యడానికి ప్రయత్నించింది.

''ఇటువంటి ఆర్ట్‌కి కూడా చిల్లరేస్తారా వాళ్ళుంటారా?'' అన్న సుచరిత సందేహం ఆమెలో కూడా సందిగ్ధంలో పడేసింది.

''గతంలో మంచి ఆర్టిస్ట్ అయ్యుంటాడు. అప్పుడు ఎవ్వరూ ఆదరించి ఉండరు. అందుకే ఇప్పుడిలా..'' అనుకుంది.

స్టేషన్‌కి చేరుకున్నాక ఆలోచనలు ప్రక్కకు నెట్టి, అభిమానుల అభినందన లందుకుంటూ లగేజి తీసుకుని లోపలకు నడిచింది.

★★★

సెంట్రల్ యూనివర్సిటీ! న్యూఢిల్లీ!

విశాలమైన హాల్.

దేశం మొత్తం మీద అనేక యూనివర్సిటీల నుంచి వచ్చిన చిత్రకారులతో నిండిపోయి ఓ గమ్మత్తైన నిశ్శబ్దంతో అలరారుతోంది. అప్పటికే కాంపిటీషన్ ప్రారంభమై గంట పైనే అయ్యింది.

ఏ కళాకారుడు ఏ చిత్రానికి జీవం పోయనున్నాడో, చిత్రకారుల సజీవ స్వప్నమైన బంగారు పతకం ఎవరి సొంతం కానున్నదో ఆ సొంతం చిత్రానికి గానీ తెలీదు. ఎవరి ఆలోచనలతో వారు, ఎవరి వైపు ధ్యాసతో వారు చకచకా పెయింటింగ్స్ వేస్తున్న ఆ వాతావరణం ఓ కొత్త రంగుల ప్రపంచాన్ని ఆవిష్కరింపజేయడానికి సమాయత్తమవుతున్నట్లుగా ఉంది.

హాల్‌లో ఓ చివరగా తనకు కేటాయించిన స్థలంలో బోర్డు ముందు నిలబడున్న కళ్యాణి కుంచెలు మాత్రం ఇంకా ప్యాలెట్‌లోకి చొరబడలేదు. అవి కళ్యాణికేసి ప్రశ్నార్థకంగా చూస్తున్నట్లనిపించసాగాయి.

ఏదో సాధించాలి, ఎంతో సాధించాలన్న ఆరాటంతో ఇంత దూరం వచ్చిన ఆమెకు నిర్వాహకులు ఇచ్చిన క్యాప్షన్‌కు తగ్గ భావన మదిలో ఇంకా తట్టకపోవడంతో టెన్షన్ పడిపోసాగింది.

మరో గంట మాత్రమే సమయముంది.

క్యాప్షన్‌కి తగ్గ కాన్సెప్ట్ తనకెందుకు స్ఫురించడం లేదో అర్థం కాలేదామెకి. యూనివర్సిటీ మొత్తం తను తీసుకురాబోయే బహుమతి కోసమే ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న దృశ్యమే కళ్ళముందు గోచరించసాగిందామెకు..

''నేనెందుకు ఆర్ట్‌ని గీయలేకపోతున్నాను?''

''ఏమయ్యింది నాకీ వేళ?''

మరో అర్ధగంట గడిచింది.

బోర్డు మీద ఫిక్స్ చేసున్న వైట్ కేన్వాస్‌లాగా బ్లాంక్‌గా అయిపోయింది ఆమె మనసు.

''అసలు మెదడెందుకు మొద్దుబారిపోయింది? పోటీలంటే ఎంతో ఉత్సాహంగా పాల్గొనే నాకు ఈరోజు ఎందుకిలా జరుగుతోంది?''

వివిధ పోటీల్లో చిన్ననాటి నుంచి తాను గెలుచుకున్న బహుమతులన్నీ ఒక్కసారిగా గేలిచేసినట్లుగా అనిపించింది కళ్యాణికి.

''అనవసరంగా నన్ను నేను ఎక్కువగా ఊహించుకున్నానా? లేక ఏదేదో సాధించేసెయ్యాలని మరీ ఎక్కువగా ఆలోచించి మనసు పాడు చేసుకున్నానా? లేక యూనివర్సిటీ నా మీద పెట్టుకున్న ఆశల వత్తిడికి తట్టుకోలేకపోతున్నానా?''

తనని తాను విశ్లేషించుకోసాగింది కళ్యాణి.

తనకి సెండాఫ్ ఇవ్వడానికి స్టేషన్‌కొచ్చిన జనసముద్రం ఆమె ముందు కదలాడింది. తన మీద వారు పెట్టుకున్న అంచనాలు, తనపై వారుంచిన విశ్వాసం ఆమెను మరింత ఉద్వేగానికి గురి చేయసాగాయి.

కాలం మరింత ముందుకు కదిలింది ఆమె ఆలోచనలకంటే వేగంగా...

''అయిపోయింది. నా ఆశలన్నీ వృథా కాబోతున్నాయి..''

కళారాధన కోసమే అంకితమైన ఆమె కళ్ళలోంచి మొదటిసారిగా జారిపడ్డాయి రెండు కన్నీటి బొట్లు.

పోటీ నుంచి ఇక నిష్క్రమించడమే మంచిదని భావించి లేవబోతూ చివరిసారిగా పోటీ క్యాప్షన్‌కేసి చూసింది.

''హోప్ ఇన్ డిస్పైర్!''

మళ్ళీ చదివింది దాన్ని. మళ్ళీ మళ్ళీ చదివింది.

మసకబారిన ఆ కళ్ళ చాటునుంచి అప్పుడు కన్పించిందామెకు ఓ అస్పష్ట చిత్రం, తన నిరాశలో ఆశలు రేకెత్తిస్తూ, మరింత స్పష్టంగా ఆ రూపాన్ని చూడ్డానికి ప్రయత్నించింది.

ఆమె ఆశ వృథా కాలేదు.

ఆమె ప్రమేయం లేకుండానే కుంచె ఆమె చేతుల్లోకి వచ్చేసింది.

ఆ వెంటనే ఓ అద్భుతమైన చిత్రం ఆ కేన్వాస్‌పై చకచకా రూపుదిద్దుకోసాగింది.

★★★

యూనివర్సిటీ ఆడిటోరియం చప్పట్లతో హోరెత్తసాగింది. ఒక అపురూపమైన ఘనతను సాధించిన కళ్యాణికి జరుగుతున్న ఆ అభినందన కార్యక్రమంలో లెక్కలేనన్ని పూల మాలలు ఆమెని అలంకరించసాగాయి.

ఆ ఆడిటోరియంలో ఓ ప్రక్క ఆమె భావ ప్రతిరూపాలైన అనేకమైన డ్రాయింగ్స్, గ్రాఫిక్స్, సర్రియలిస్టిక్ ఆర్ట్స్, క్యారికేచర్స్...ఎన్నో పెయింటింగ్స్ ఒక క్రమంలో డిస్‌ప్లే చేయబడ్డాయి. సృజనాత్మకతను చాటిచెప్పే ఆ కళాఖండాలు ఆమె పరిణితిని తెలియజేయసాగాయి. స్టూడెంట్స్, స్టాఫ్ అనుభవిస్తున్న ఆనందాల నడుమ అవి మరింత అందాలను విరజిమ్మసాగాయి.

జాతీయస్థాయి పోటీలకు ఎంట్రీ లభించినందుకు అభినందనలు అందుకుంటున్న కళ్యాణి మనసు మాత్రం ఆ ఉత్సవంలో పాలుపంచుకోలేకపోతోంది. గోల్డ్‌మెడల్ సాధించిన ఆనందం ఆమెలో ఏ కోశానా కనిపించడం లేదు. చీటికిమాటికి ఆడిటోరియం ఎంట్రన్స్‌కేసే చూడసాగింది.

క్యాంపస్‌కు సంబంధించిన వారేకాక బైటినుంచి కూడా ఆ వన్ ఉమన్ షోను చూడ్డానికి రాసాగారు. గోల్డ్‌మెడల్ సాధించిన 'హోప్ ఇన్ డిస్పైర్' పెయింటింగ్ ప్రక్కనే ఏర్పాటు చేసిన విజిటర్స్ ఒపీనియన్ బుక్‌లో తమ తమ అభిప్రాయాలను రాయసాగారు.

జనం పలచబడేదాకా కళ్యాణి అలా ఎంట్రన్స్‌కేసి చూస్తూనే గడిపింది.

చివరిగా ఎగ్జిబిషన్‌ను క్లోజ్ చెయ్యబోతుండగా అప్పుడు ప్రవేశించాడు రోడ్డు మీద బొమ్మలు గీసే ఆ వ్యక్తి. అతన్ని చూడగానే ప్రారంభమయ్యింది ఆమెలో అసలైన అలజడి. అతను రావాలనుకుందో, రాకూడదనుకుందో కూడా తెలీదామెకు. కాని అతని రాకకోసం మాత్రం ఎందుకో ఎదురుచూసింది.

అతను నెమ్మదిగా నడుచుకుంటూ ఒక్కొక్క చిత్రాన్నే చూసుకుంటూ తనలో తనే ఏదో గొణుక్కోసాగాడు. దట్ట



మైన మెరిసిన తన గడ్డాన్ని సవరించుకుంటూ, చివరిగా తను బహుమతి గెల్చుకొన్న 'హోప్ ఇన్ డిస్పైర్' పెయింటింగ్ దగ్గరకొచ్చి ఆగాడు.

భయంకరమైన నిస్తబ్దత ఆవరించింది కళ్యాణిని వెంటనే. ముఖానికి పట్టిన చెమటని ఎవరూ చూడకుండా తుడుచుకుంది. ఆమె శరీరం నెమ్మదిగా కంపించసాగింది. ఆ వృద్ధుడు ఆ పెయింటింగ్‌ని చాలా క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఒపీనియన్ బుక్‌ని చేతిలోకి తీసుకోవడంతో అప్పుడు మొదలయ్యిందామెలో అసలైన యాంగ్జైటీ.

అతనేం రాస్తాడో తనూహించగలదు.

జేబులో నుంచి చిన్న పెన్సిల్ ముక్కని తీసి రాయసాగాడతను. ఆన రాస్తున్నంతసేపూ ఎంతో నెర్వస్‌గా ఫీలయ్యిందామె.

తన అభిప్రాయాన్ని రాసేసి, కనీసం తన వంకైనా చూడకుండా ఆ వృద్ధుడు వెళ్ళిపోవడంతో నిశ్చేష్టురాలయ్యింది కళ్యాణి. ఆ పరిస్థితి నుంచి బైటికి రావడానికి ఆమెకు చాలా సమయమే పట్టింది.

పెయింటింగ్స్ అన్నీ కార్లో సర్దేసుకుని ఇంటికి బయల్దేరుతుండగా అంది కాంతి "ఇందాక ఆ తాత కూడా ఎగ్జిబిషన్‌కి వచ్చాడే. అంతేకాదు ఒపినియన్ బుక్‌లో కూడా ఏదో రాశాడు" అంది.

"ఏం రాసుంటాడంటావ్?" అడిగింది సుచరిత వెనక డోర్ ఓపెన్ చేస్తూ.

"ఆ..ఆ..అభిప్రాయాలూ, అవీ మనకర్థమవుతాయా, ఏమన్నానా? పోనీ నువ్వే చెప్పు కళ్యాణీ, ఆ ముసలాడు ఏం రాసుంటాడంటావ్?" అడిగింది కాంతి.

"ఏమని చెప్పేది. నేను రోడ్డు మీద గీసిన బొమ్మని కాపీ కొట్టి నువ్వు ప్రైజు తెచ్చుకోవడం న్యాయమా అని రాసుంటుందని ఎలా చెప్పేది?" పంటి బిగువున ఆపుకుంది తన గుండె లోతుల్లోంచి పెల్లుబుకి రాబోయిన ఆ నగ్న సత్యాన్ని.

పోటీకి బయల్దేర్తూ రోడ్డు మీద ఆ వృద్ధుడు గీసిన బొమ్మని తను కాకతాళీయంగా చూడడం, ఆ బొమ్మ పోటీలో తనకిచ్చిన కాప్షన్‌కి సరిగ్గా సరిపోవడం, తను ఆ బొమ్మనే గీసి గోల్డ్‌మెడల్ కొట్టుకోవడం అంతా కలలో జరిగిపోయినట్లుగా అనిపించింది కళ్యాణికి.

చాలా గిల్టీగా ఫీలయ్యిందామె.

'నేనా పని చెయ్యకుండా ఉండాల్సింది!' అనుకుంది.

అనుకుంటూనే "మీరే చూడండి. మనమిప్పుడు ఆయన్ని వెదకడానికే వెళ్తున్నాం!" అంది.

"ఇంత రాత్రిపూటా?" ఆశ్చర్యపోయారు స్నేహితురాళ్ళిద్దరూ.

"ఇప్పటికే చాలా ఆలశ్యం చేశాను" అంది స్టీరింగ్ ముందు కూర్చుంటూ.

గబగబ పేజీలు తిప్పిన సుచరిత అతను రాసిన అభిప్రాయాన్ని కళ్యాణి ముందుంచింది.

స్టన్ అయ్యింది కళ్యాణి. ఆ అభిప్రాయాన్ని చదివిన వెంటనే.

"బ్యాక్‌గ్రౌండ్ షేడింగ్‌కి మెరూన్ బదులు లైట్ బ్లూ కలర్ వాడుంటే నిండుగా ఉండేది. పెయింటింగ్ పది కాలాలపాటు గొప్ప కళాఖండంగా వర్ధిల్లేది. శుభాశీస్సులు!"

విమర్శకు బదులు ఆశీస్సులుండడంతో ఆశ్చర్యంతో నోట మాట రాలేదామెకు. క్రియేటివిటీకి మారుపేరైన తాను ఆ వృద్ధుడి ఆర్ట్‌ని కాపీకొడితే అతను ఏమాత్రం రియాక్ట్ కాకుండా చక్కని సూచన ఇవ్వడం వెనక అతని హృదయం అర్థమయ్యిందామెకి.

"సాటి కళాకారిణిగా ఆయన నాకెంతో గౌరవమిచ్చాడు. కాని నేను.."

కారుని డాబా గార్డెన్స్ వైపు పోనిచ్చింది.

"గొప్ప ఆర్టిస్టైన ఆయనకు కాలం కలసిరాక దుర్భర దారిద్ర్యం మిగిలితే, సంపన్నురాలైన నాకు ఆయనంత ప్రతిభ లేకపోయినా సన్మానాలు, నీరాజనాలు.."

"ఎంత తప్పు చేశాను?" కారుని సింధియా కాలనీవైపు పోనిస్తూ అనుకుంది.

'వెళ్ళి అతనికి క్షమాపణ చెప్పుకోవాలి. అది నా తప్పును సరిదిద్దుతుందా? అసలాయన నన్ను క్షమిస్తాడా?'

ఆ చీకట్లో వీధులన్నీ వెదుకుతూ ఈస్ట్ పాయింట్ కాలనీలోకి పోనిస్తుండగా కాంతి వేసిన పెద్ద కేకకి సడన్ బ్రేక్ వేసి ఆపింది కారుని.

"అటు చూడవే!" చూపించింది కాంతి.

ఆ దృశ్యాన్ని చూసిన వెంటనే ఒక్కసారిగా కారులో నుంచి క్రిందకు ఉరికి ఆ వైపు పరుగుతీసింది కళ్యాణి.

జీవకళ ఉట్టిపడుతున్న ఏసుక్రీస్తు బొమ్మ పాదాల దగ్గర నిర్జీవంగా పడుంది ఆ వృద్ధుడి మృత దేహం.

అతని తల దగ్గర లాంతరు బుడ్డీ... ఆఖరి వెలుగునిస్తూ..

బొమ్మమీద అక్కడక్కడ పడున్న చిల్లర డబ్బులు.

ఆమె కళ్ళు కన్నీటి జలపాతాలయ్యాయి. మొహాన్ని చేతుల్లో కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

కాంతి ఆమె భుజం మీద చెయ్యేసి అనునయించేదాకా ఎంతసేపలా రోదించిందో ఆమెకే తెలీదు.

నెమ్మదిగా తేరుకుని తను పోటీలో గెలుచుకున్న గోల్డ్ మెడల్‌ని బైటికి తీసింది.

కాంతి, సుచరితలు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు కళ్యాణి ఏం చేస్తుందో అర్థంకాక.

గోల్డ్‌మెడల్‌ని ఆ వృద్ధ ఆర్టిస్ట్ పాదాలపై ఉంచి నమస్కరించింది కళ్యాణి.

ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్లుగా అవాక్కై నిలిచిపోయారు స్నేహితురాళ్ళిద్దరూ.

చీకట్లో ఆ గోల్డ్‌మెడల్ అప్పటివరకూ లేని వింత కాంతుల్ని విరజిమ్మసాగింది.

"ఎంతమంది కళాకారులు ప్రోత్సాహం కరువై ఇలా వీధినపడుతున్నారో? ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్న వారిలో అసలు నిజమైన కళాకారులెందరో?"

ఆ చీకట్లో ఎన్నో ప్రశ్నలు ఆమెను పలకరించాయి.

ఆ ప్రశ్నల పరంపరలోంచి బైటికొస్తూ స్నేహితురాళ్ళతో అంది "నేను ఆలిండియా కాంపిటీషన్స్‌లో పాల్గొనడం లేదు" అని.

నివ్వెరపోయారు స్నేహితురాళ్ళిద్దరూ.

"నాకా అర్హతలేదు" మళ్ళీ తనే అంది.

నిశ్శబ్దత పూర్తిగా ఆవరించుకున్న ఆ చీకట్లో శవం పక్కనే కూర్చుందామె.

మొట్టమొదటిసారిగా ఒక గొప్ప ఆర్టిస్ట్ ప్రక్కన చోటు దొరికినట్లనిపించిందామెకి.

"కళాకారుణ్ణి సాటి కళాకారుడే ఆదరించాలి. లేకుంటే కళకు అర్థమే 'లేదు..'" మస్తిష్కంలో మెదులుతున్న భావాలను జీవిత సత్యాలుగా ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నదామె.

తూరుపు వెలుగు రేఖలు పలకరించేదాకా మినుకుమినుకుమన్న ఆ దీపం బుడ్డీ, ఉదయానికి అవకాశమిస్తూ మెల్లగా తప్పుకుంది.

దూరంగా ఎక్కడో చర్చి గంటలు మ్రోగుతున్న ధ్వని.

అప్పటికే నిద్ర లేచిన పక్షులు రెక్కలు టపటపా కొట్టుకుంటూ ఉల్లాసంగా ఎగరసాగాయి. అవి చేస్తున్న కువకువల ధ్వనులు స్వాగత గీతాన్నాలపిస్తున్న అర్థాన్నివ్వసాగాయి, కళ్యాణిలో మరో కొత్త ఆర్టిస్ట్ ఆవిర్భావానికి ఆహ్వానం పలుకుతూ!

✪

